క్లుప్తంగా

ఆలయాలు భారతీయ సంస్కృతికి ప్రతీకలు



తోడుగుడ్లపాడులో రామాలయానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం: ఆలయాలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మాచర గ్రామ శివారు తోడుగుడ్లపాడులో రామాలయ నిర్మాణ పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఆ గ్రామంలోని శెట్టిబలిజ కాలనీలో నిర్మితమవుతున్న ఆలయం ఆధ్యాత్మిక కార్యక్రమాలకు వేదిక కాగలదని ఆకాంక్షించారు. గ్రామానికి చెందిన మహిళలు పలు సమస్యలను ప్రస్తావించగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, సర్పంచ్ వాసంశెట్టి సునీత, సహకార సంఘాల చైర్మన్లు కరెడ్ల చంటిబాబు, మేడిశెట్టి గోవింద్, వైఎస్సార్ సీపీ నాయకులు వాసంశెట్టి విష్ణు, శీలం గోవింద్, నక్కా సింహాచలం పాల్గొన్నారు.

మంజేరు లాకులకు మరమ్మతులు చేపట్టాలి

కాజులూరు: మండలంలో కోరంగి కెనాల్‌పై మంజేరు వద్ద ఉన్న లాకులకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. గత కొన్నేళ్లుగా లాకుల తలుపులకు రంధ్రాలు, పగుళ్లు ఏర్పడి శిథిలావస్థకు చేరుకున్నాయి. కాలువలో లెవెలింగ్ కోసం నిలబెట్టిన నీరు రంధ్రాల ద్వారా డ్రైన్‌లోకి పోతుంది. ఈ లాకుల పై భాగంలో సుమారు పదివేల ఎకరాల ఆయకట్టు ఉందని లాకులు మరమ్మతుల కారణంగా నీరు వృథాగా పోయి ఏటా తొలకరి, దాళ్వాలలో సాగునీటి కొరత తలెత్తుతందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం తలెత్తిన నీటిఎద్దడి నేపథ్యంలో అధికారులు లాకులకు మరమ్మతులు చేపట్టకుంటే దాళ్వాసాగు చివరి రోజుల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవలసి ఉంటుందని రైతులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని మంజేరు సర్పంచ్ గుంటూరి అప్పారావు, శీల గ్రామ సర్పంచ్ కోమలి వెంకటరమణ, స్థానిక రైతులు వెంకన్న, నల్లమిల్లి రామారెడ్డి తదితరులు కోరుతున్నారు.

ఫస్టియర్ పరీక్షలకు 320 మంది హాజరు

రాయవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన ఇంటర్ ఫస్టియర్ పరీక్షలకు 320 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఫిజిక్స్ పరీక్ష 181 మంది పరీక్ష రాయాల్సి ఉండగా, 169 మంది హాజరవగా, 12 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఎకనామిక్స్ పరీక్ష 163 మంది పరీక్ష రాయాల్సి ఉండగా, 151 మంది హాజరు కాగా 12 మంది గైర్హాజరయ్యారు. ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేనట్లు పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ దారపు వీర వెంకట నాగేశ్వరరెడ్డి తెలిపారు.

నిత్యావసర సరకుల పంపిణీ

కె.గంగవరం: మండలంలోని కె.గంగవరం, పాణింగపల్లిలో మృతి చెందిన కుటుంబాలకు డొక్కా సీతమ్మ ఆసరా పథకం ద్వారా జనసేన నాయకుడు పోలిశెట్టి చంద్రశేఖర్ శనివారం నిత్యావసరాలు పంపిణీ చేశారు. కె.గంగవరం గ్రామానికి చెందిన నావి నాగరాజు, పాణింగపల్లి గ్రామానికి చెందిన పెందుర్తి బాబురావులు ఇటీవల మరణించారు. ఈ నేపథ్యంలో వారి కుటుంబ సభ్యులను జనసేన నియోజకవర్గ నాయకుడు పోలిశెట్టి చంద్రశేఖర్ పరామర్శించి పోలిశెట్టి లక్ష్మీ సుబ్బారావు చారిటబుల్ ట్రస్ట్ తరఫున నిత్యవసరాలు పంపిణీ చేశారు. సంపత్, పోలిశెట్టి శ్రీను, గుబ్బల శ్రీనివాస్, ముంగి రమేష్, చిర్రా రాజ్‌కుమార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల రక్తదానం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన డీఈ శ్రీధర్‌వర్మ తదితరులు

రామచంద్రపురం: విద్యుత్ బ్లడ్ డోనర్స్ అండ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్‌వీఆర్ ఫంక్షన్ హాల్‌లో శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన డీఈ దాట్ల శ్రీధర్‌వర్మ మాట్లాడుతూ తలసేమియా వ్యాధితో బాధ పడుతున్న వారితో పాటుగా విద్యుత్ ఉద్యోగులకు అవసరమైనప్పుడు రక్తం ఉపయోగపడాలనే ఉద్దేశంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించినట్లు చెప్పారు. ప్రతి ఉద్యోగి ఈ శిబిరంలో భాగస్వాములు కావటం సంతోషంగా ఉందని డీఈ అన్నారు. రామచంద్రపురం డివిజన్ పరిధిలోని విద్యుత్ ఉద్యోగులు ఈ రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు.

నెరవేరుతున్న చిరకాల వాంఛ

- ద్వారపూడిలో మత్స్యకార కమ్యూనిటీ హాలుకు భూమిపూజ
- హాజరైన ఎంపీలు వెంకటరమణ, అనురాధ, ఎమ్మెల్సీ తోట
- ఆనందం వ్యక్తం చేస్తున్న జాలర్లు



కమ్యూనిటీహాలుకు భూమిపూజ చేస్తున్న ఎంపీలు వెంకటరమణ, అనురాధ, ఎమ్మెల్సీ తోట తదితరులు

మండపేట: తమ సామాజికవర్గానికి సొంతంగా కమ్యూనిటీ హాలు నిర్మించుకోవాలన్నది అక్కడి మత్స్యకారుల చిరకాల వాంఛ. నాలుగు దశాబ్దాలుగా ఎందరో నాయకుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. వారి కలను నెరవేరుస్తూ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి భూమిపూజ ఘనంగా జరిగింది.ఈ వేడుకకు ఎంపీలు మోపిదేవి వెంకటరమణ, చింతా అనురాధలు హాజరయ్యారు.

మండలంలోని ద్వారపూడిలో అధిక సంఖ్యలో మత్స్యకార సామాజికవర్గం వారు నివసిస్తున్నారు. వివాహాలు, ఇతర వేడుకలు, సంఘ సమావేశాలు నిర్వహించుకునేందుకు సొంతంగా కమ్యూనిటీ హాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది. సొంతంగా నిర్మించుకుందామన్నా స్థలం లేదు. స్థలం సమకూర్చి కమ్యూనిటీ హాలు నిర్మించాలని తమ సంఘ పెద్దలు 40 ఏళ్లుగా ఎంతోమంది నాయకులు, అధికారుల చుట్టూ తిరిగినా ఎవరూ పట్టించుకోలేదని శ్రీరామగంగా ఫిషర్‌మన్ కో–ఆపరేటీవ్ సొసైటీ నాయకులు తెలిపారు. గతంలో కొందరు నాయకులు హామీ ఇచ్చినా కార్యరూపం దాల్చలేదన్నారు.

ఎమ్మెల్సీ తోట చొరవతో..

ద్వారపూడి సర్పంచ్ ఈతకోట కిన్నెర, ఉప సర్పంచ్ తులా శేషారావు, సొసైటీ చైర్మన్ దంతులూరి శ్రీరామవర్మలు మత్స్యకార సంఘ పెద్దలతో కలిసి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును కలిసి సమస్యను వివరించగా ఆయన వెంటనే స్పందించారు. మత్స్యకార కాలనీని ఆనుకుని ఉన్న 10 సెంట్ల విలువైన పంచాయతీ స్థలాన్ని వారికి కేటాయించేందుకు పంచాయతీ తీర్మానం చేయించారు. కమ్యూనిటీ హాలు నిర్మాణానికి ఎంపీలు మోపిదేవి వెంకటరమణ, చింతా అనురాధలతో కలసి శనివారం భూమిపూజ చేయించారు. కమ్యూనిటీ హాలు కోసం తన ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.20 లక్షలు ఇస్తానని ఈ సందర్భంగా ఎంపీ మోపిదేవి హామీ ఇవ్వగా, తనవంతు సహకారం అందిస్తానని ఎంపీ అనురాధ తెలిపారు. త్వరితగతిన కమ్యూనిటీ హాలు పూర్తి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ తోట తెలిపారు. ఎన్నో ఏళ్ల నాటి తమ చిరకాల వాంఛను నెరవేర్చడం పట్ల మత్స్యకార కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సర్పంచ్ ఈతకోట కిన్నెర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉప సర్పంచ్ తులా శేషారావు, సొసైటీ చైర్మన్ దంతులూరి శ్రీరామవర్మ, పార్టీ నాయకులు చిక్కాల శ్రీనివాసరావు, పోలినాటి సత్యనారాయణ, పోతుల రాంబాబు, యరగతపు విజయ్‌కుమార్, సత్తి సత్తిబాబు, నామాల పెదవెంకన్న, దాసరి వీరవెంకటలక్ష్మి, తొంటాపు సత్తిపండు, గిలకంశెట్టి కుమార్, మందపల్లి ప్రసాద్, గూడూరి సుబ్బరాజు, సత్తి రాంబాబు, ఆలీషా తదితరులు పాల్గొన్నారు.

మా చిరకాలవాంఛను నెరవేరుస్తున్నారు



మత్స్యకార సంఘానికి సొంతంగా కమ్యూనిటీ హాలు నిర్మించుకోవాలన్నది మా 40 ఏళ్ల కల. గతంలో ఎంతోమంది చుట్టూ తిరిగినా ఫలితం లేకకపోయింది. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట ఇచ్చినట్టుగానే కమ్యూనిటీ హాలు నిర్మాణం చేపట్టారు.
– అంజూరి నాగేశ్వరరావు, సంఘ నాయకుడు

ఎమ్మెల్సీ తోటకు రుణపడి ఉంటాం



వివాహ వేడుకలు, సంఘ సమావేశాలు నిర్వహించుకునేందుకు సరైన వసతి లేక చాలా ఇబ్బంది పడుతున్నాం. మా సమస్యను చెప్పగానే వెంటనే స్పందించి కమ్యూనిటీ హాలు సమస్యను పరిష్కరించి ఎమ్మెల్సీ తోటకు రుణపడి ఉంటాం.
– సింగిడి ప్రసాద్‌కుమార్, మత్స్యకార సంఘాధ్యక్షుడు

టిడ్కో గృహాలకు రెండు పూటలా నీరు

- వృథాను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలి
- చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి
- ఒక్కో బ్లాకుకు ఇన్‌చార్జిగా సచివాలయ ఉద్యోగి



టిడ్కో ప్లాట్ల వద్ద అధికారులతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: టిడ్కో ఫ్లాట్లలో నివసిస్తున్న వారికి నీటి సమస్య లేకుండా రెండు పూటలా బ్లాకుల్లోని ట్యాంకులను నింపాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అధికారులను ఆదేశించారు. రోజుకు ఒక పూట మాత్రమే ట్యాంకు నింపుతుండడంతో నీటి సమస్య ఉంటోందని స్థానికుల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు శనివారం మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్, ఇంజినీరింగ్ అధికారులతో కలసి టిడ్కో ప్లాట్లను పరిశీలించారు. ప్లాట్లు స్వాధీనం చేసుకున్న కొందరు ట్యాప్‌లు కట్టకుండా తాళాలు వేసుకుని వెళ్లిపోవడంతో నీరు వృథాగా పోతోందని టిడ్కో అధికారులు చైర్‌పర్సన్ దుర్గారాణి, కమిషనర్ రామ్‌కుమార్ దృష్టికి తీసుకు వచ్చారు. సంబంధిత లబ్ధిదారులను పిలిపించి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే ఉదయం, సాయంత్రం రెండు పూటలా బ్లాకుల్లోని ట్యాంకులను నింపేందుకు నైట్ ఆపరేటర్‌ను ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. బ్లాకుల వద్ద దుస్తులు ఉతుక్కునేందుకు వీలుగా ప్లాట్‌ఫాంలు నిర్మించేందుకు బోర్లు ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించారు. ప్లాట్లలో నివసిస్తున్న వారికి ఇబ్బంది లేకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్ అధికారులకు సూచించారు. ప్రస్తుతం 60 బ్లాకుల్లో దాదాపు 550 కుటుంబాల వారు నివసిస్తున్నారని, వారికి ప్లాట్లు నిర్వహణ, నీటి వృథాను అరికట్టే విషయలపై అవగాహన కల్పించేందుకు ఒక్కో బ్లాకుకు ఒక్కో సచివాలయ ఉద్యోగిని ఇన్‌చార్జిగా నియమించనున్నట్టు కమిషనర్ రామ్‌కుమార్ తెలిపారు. ఏఈ సత్యనారాయణ, పార్టీ అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు పాల్గొన్నారు.

ప్లాట్ల అమ్మకాలు, కొనుగోళ్లు నేరం

వైఎస్సార్ జగనన్న నగర్‌లోని టిడ్కో ప్లాట్లు అమ్మకాలు, కొనుగోళ్లు నేరమని, అటువంటి కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ టి. రామ్‌కుమార్ హెచ్చరించారు. అటువంటివి ఏమైనా జరిగితే సంబంధిత ప్లాట్‌ను స్వాధీనం చేసుకుని అర్హులైన వారికి అందిస్తామన్నారు. తొలి విడతగా స్వాధీనం చేసిన 2109 ప్లాట్లలోకి లబ్ధిదారులు రావాలని కమిషనర్ కోరారు. లేనిపక్షంలో ఆయా ప్లాట్లను మున్సిపాలిటీ స్వాధీనం చేసుకుంటుందని తెలిపారు.

మురుగునీటి శుద్ధి ప్రాజెక్టుకు రూ. 6 కోట్లు

స్థల పరిశీలన చేసిన మంత్రి వేణు



వెల్లలో మురుగునీటి శుద్ధి ప్రాజెక్టుకు స్థల పరిశీలన చేస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం పట్టణం నుంచి రామచంద్రపురం రూరల్ వెల్ల మీదుగా వెళ్లే ప్రధాన మురుగునీటి కాలువ నీటిని శుద్ధి చేసి శుద్ధ జలంగా ఉపయోగించుకునేందుకు అనువుగా మురుగు నీటి శుద్ధి ప్రాజెక్టుకు రూ.6 కోట్లు మంజూరు అయినట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. ఈ మేరకు ఆయన ప్రాజెక్టుకు అనువైన స్థలం కోసం వెల్ల గ్రామంలో స్థల పరిశీలన చేశారు. చెత్త సంపద కేంద్రంకు సమీపంలోని స్థలం అనువైనదిగా గుర్తించి స్థల సేకరణకు అధికారులను ఆదేశించారు. అనంతరం వెల్లసావరం, ద్రాక్షారామ, హసన్‌బాద, ఉండూరు గ్రామాల్లో జగనన్న కాలనీల్లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులను పనులు సాగుతున్న తీరుతెన్నులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంత్రి వేణు వెంట వెల్ల సర్పంచ్ వీరబోయిన సూరిబాబు, ఏరుపల్లి సర్పంచ్ మల్లిమొగ్గల శ్రీధర్, తహశీల్దార్ పి.తేజేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి, హౌసింగ్ డీఈ మల్లికార్జునరావు, ఏఈ వెంకట్, ద్రాక్షారామ ఎస్సై బి.వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ద్రాక్షారామ జెడ్పీహెచ్‌ఎస్‌ను సందర్శించిన అధికారులు



ద్రాక్షారామ సైన్స్ ప్రయోగశాలను పరిశీలిస్తున్న కడప, నెల్లూరు జిల్లాల సైన్స్ అధికారులు

రామచంద్రపురం రూరల్: రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు విచ్చేసిన వివిధ జిల్లాల సైన్స్ అధికారులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని పలు పాఠశాలల్లో సైన్స్ ప్రయోగశాలలను పరిశీలిస్తున్నారు. దీనిలో భాగంగా ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌లోని సైన్స్ ప్రయోగశాలను కడప జిల్లా సైన్స్ అధికారి బి.మహేశ్వర రెడ్డి, నెల్లూరు జిల్లా సైన్స్ అధికారి తిరుమలేష్ శనివారం పరిశీలించారు. పాఠశాలల్లో విజ్ఞాన శాస్త్ర సంబంధమైన పాఠ్యాంశాలు బోధనోపకరణాలతో బోధించాలనేది పాటిస్తూ అందుకు తగిన బోధనోపకరణాలు సమకూర్చుకున్న పాఠశాల సైన్స్ టీచర్లను వారు అభినందించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి గిరజాల వెంకట సత్య సుబ్రహ్మణ్యం, పాఠశాల ప్రధానోపాధ్యాయిని పీఎస్‌బీఎస్‌కే సుందరి, సైన్స్ ఉపాధ్యాయులు పసుపులేటి మెహర్‌సుజాత, బొడ్డు సూర్యనారాయణమూర్తి, సంగీతం సత్యరామ్, గుణ్ణం సత్తిబాబు పాల్గొన్నారు.


‘నాడు-నేడు’ పనులు వేగవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసు

రాయవరం: మనబడి నాడు–నేడు రెండో విడత పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో డి.శ్రీనివాసు సూచించారు. మండల విద్యాశాఖ కార్యాలయ సమావేశపు హాల్లో శనివారం ఎంఈవో వై.సత్యనారాయణ అధ్యక్షతన నాడు–నేడు పాఠశాలల హెచ్‌ఎంలు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో శ్రీనివాసు మాట్లాడుతూ నాడు–నేడు పనులు నిర్వహిస్తున్న పాఠశాలలకు ప్రభుత్వం నిధులు విడుదుల చేసిందన్నారు. ఖర్చు చేసిన సొమ్ముకు సంబంధించిన బిల్లులను ఎప్పటికపుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఎంఈవో సత్యనారాయణ మాట్లాడుతూ మండలంలో 20 ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో నాడు–నేడు రెండో విడత పనులు జరుగుతున్నట్లు తెలిపారు. రూ.1.11 కోట్లు రివాల్వింగ్ ఫండ్ పాఠశాలలకు నిధులు విడుదలైనట్లు తెలిపారు. ఈ నెల 31, ఏప్రిల్ 1న విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ పర్యటన ఉన్నందున పాఠశాల హెచ్‌ఎంలు రికార్డులు అప్ టు డేట్‌గా ఉంచుకోవాలని సూచించారు. సమగ్ర శిక్షా ఏఈ సూర్యనారాయణ మాట్లాడుతూ సాంకేతిక పరమైన ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకుని రావాలన్నారు. సమావేశంలో సీఆర్పీలు కె.సీనాసిరి, వాసంశెట్టి సీతాధనలక్ష్మి, ఎంఐఎస్ కోఆర్డినేటర్ ఎస్.రామారావు, మండలంలోని వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ నాగరాజు

కె.గంగవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు–నేడు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పక పాటించాలని ఎంఈఓ ఎ.నాగరాజు హెచ్‌ఎంలకు సూచించారు. స్థానికంగా ఉన్న ఎమ్మార్సీలో శనివారం ప్రధానోపాధ్యాయులతో నాడు–నేడు పనులపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 35 ప్రభుత్వ పాఠశాల్లో నాడు–నేడు పనులు జరుగుతున్నాయన్నారు. ఇవి వివిధ స్థాయిల్లో నిర్మాణాలు జరుగుతున్నాయని ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సిమెంట్ కొరత కొంత వరకు ఉందని త్వరలో ఆ సమస్య పరిష్కారమవుతుందని హెచ్‌మెంలకు తెలిపారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి ప్రగతిని విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించాలని సూచించారు.

మంచి మార్కులతో పదిలో రాణించాలి



విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందిస్తున్న వైస్ ఎంపీపీ నాగబాబు

మండపేట: పూర్తి ఏకాగ్రతతో 10వ తరగతి పరీక్షలు రాయడం ద్వారా ఉత్తమ మార్కులు సాధించి పాఠశాలకు, గురువులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు అన్నారు. మండలంలోని ఏడిద జెడ్పీ ఉన్నత పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులు 120 మందికి వాసవీ క్లబ్‌కు చెందిన బోనగిరి పాపారావు దంపతుల ఆధ్వర్యంలో ప్యాడ్‌లు, పెన్నులు, పరీక్షలకు అవసరమైన ఇతర సామగ్రిని నాగబాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినికి రూ. 5000 నగదు బహుమతిని ప్రకటించారు. అలాగే 1981– 82 పూర్వ విద్యార్థులు కూడా ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తామన్నారు. ఆర్‌సీ క్లబ్ చైర్‌పర్సన్ వెత్సా రత్నకుమారి, సీహెచ్ లోవరాజు, ఎ. పుష్ప, హెచ్‌ఎం ఐజాక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ తోటకు దళిత నేతల కృతజ్ఞతలు



ఎమ్మెల్సీ తోటకు కృతజ్ఞతలు తెలుపుతున్న దళిత నేతలు

మండపేట: దళిత క్రిస్టియన్లను ఎస్సీల్లో చేర్చాలని ఏపీ అసెంబ్లీ తీర్మానం చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ దళిత నేతలు హర్షం వ్యక్తం చేశారు. ద్వారపూడి పంచాయతీ కార్యాలయంలో శనివారం పార్టీ నాయకుడు తుపాకుల ప్రసన్నకుమార్ అధ్యక్షతన సర్పంచులు బూరిగ ఆశీర్వాదం, ఈతకోట కిన్నెర తదితరులు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఎంతోమంది నిరుపేద క్రిస్టియన్ దళితులకు వరంగా మారుతుందని వారు ఆనందం వ్యక్తంచేశారు. దళిత నాయకులు ముమ్మిడివరపు బాపిరాజు, వల్లూరి రామకృష్ణ, పలివెల సుధాకర్, యడ్ల రవి, ఏలేటి గంగరాజు, గుత్తుల రాజశేఖర్, యడ్ల రాజేష్, గెద్దం గాంధీబాబు, యడ్ల చిట్టిబాబు, బత్తుల గోవింద్ రాజు, కాలేరు రాజు తదితరులు పాల్గొన్నారు.

రోగి ఇంటికి వెళ్లి వైద్య సేవలు



తాతపూడిలో ఇంటికెళ్లి వృద్ధునికి చికిత్స అందిస్తున్న డాక్టర్ అనూజ ప్రియాంక

కపిలేశ్వరపురం: ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా తాతపూడి గ్రామంలో శనివారం రోగుల ఇళ్లకు వెళ్లి అంగర పీహెచ్‌సీ వైద్యురాలు జె.అనూజ ప్రియాంక చికిత్స చేశారు. ప్రతి నెలా మూడో శనివారం గ్రామంలో వైద్యసేవలిందిస్తున్నారని, శిబిరానికి వచ్చేందుకు శక్తిలేని వృద్ధ రోగుల ఇళ్లకు వైద్యులే వచ్చి సేవలందిస్తున్నారని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. శిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, కిశోర బాలికలకు వైద్యసేవలందించారు. కార్యక్రమంలో హెచ్‌ఈ బి.రామారావు, ఎంపీహెచ్‌ఎస్ టి.మేరీమణి, పి.సురేష్, ఎంఎల్‌హెచ్‌పి కె.దీప్తి, ఆరోగ్య కార్యకర్తలు తోటకూర రామకృష్ణ, దేవి, 104 సిబ్బంది ప్రసాద్, రాజు వైద్య సేవలందించారు.

సర్పంచ్ ఫిర్యాదుపై కేసు నమోదు

రాయవరం: మండలంలోని కురకాళ్లపల్లి సర్పంచ్ పిల్లి శారద ఇచ్చిన ఫిర్యాదుపై శనివారం కేసు నమోదు చేసినట్లు రాయవరం ఎస్సై పీవీవీఎస్ఎన్ సురేష్ తెలిపారు. సర్పంచ్ శారద మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఆహ్వానం మేరకు అంగన్‌వాడీ కేంద్రం వద్ద గర్భిణులకు పోషకాహారం కిట్లు ఇచ్చేందుకు వెళ్తుందన్నారు. ఆ సమయంలో కొంతమంది వ్యక్తులు సర్పంచ్ శారదను పరుష పదజాలంతో దూషణలకు దిగడమే కాకుండా భయభ్రాంతులకు గురిచేశారు. దీనిపై ఆమె ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు



వీరభవాని (ఫైల్)

రాయవరం: మండలంలోని మాచవరానికి చెందిన సత్తి వీర భవాని అదృశ్యమైనట్లు భర్త వెంకటరెడ్డి ఇచ్చిన ఫిర్యాదుపై శనివారం కేసు నమోదు చేసినట్లు రాయవరం ఎస్సై సురేష్ విలేకరులకు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటరెడ్డి, వీరభవానీలు మాటా మాటా అనుకున్న నేపథ్యంలో ఈ నెల 23న వెంకటరెడ్డి ఇంట్లో లేని సమయంలో తన ఇద్దరు పిల్లలను తీసుకుని భవాని ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు, బంధువుల ఇళ్ల వద్ద గాలించినా ప్రయోజనం లేక పోవడంతో భర్త వెంకటరెడ్డి రాయవరం పోలీసులను ఆశ్రయించాడన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

ఉత్సాహంగా ఫేర్‌వెల్



హెచ్‌ఎం సత్యనారాయణను సత్కరిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

రామచంద్రపురం: పట్టణంలోని ఎస్‌కేపీజీఎస్ ప్రభుత్వ పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థులు ఫేర్ వెల్ పార్టీని ఉత్సాహంగా జరుపుకొన్నారు. ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ మాట్లాడుతూ పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. పరీక్షలకు సంబంధించిన మెళకువలను ఆయన తెలియజేశారు. సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు, విద్యార్థులకు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయులను సత్కరించారు. విద్యార్థుల ఆటపాటలు అందరినీ అలరించాయి.

ఆశా కార్యకర్తల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

మండపేట: మండలంలోని ద్వారపూడి పీహెచ్‌సీ పరిధిలోని ఏడిద సీతానగరం, అర్తమూరు గ్రామాల్లో ఆశా కార్యకర్తల నియామకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు మండల వైద్యాధికారి ఎస్.సూర్యనారాయణరెడ్డి తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సచివాలయం పరిధిలో నివసిస్తూ 25 నుంచి 45 ఏళ్ల మధ్య వయసు కలిగి ఉండాలన్నారు. కనీస విద్యార్హత 8వ తరగతి పాసై ఉండాలన్నారు. ఆరోగ్యం, సంక్షేమం, పారిశుద్ధ్యం తదితర అంశాలపై అవగాహన కలిగి ఉండాలని, అర్హత కలిగిన వారు 27వ తేదీ నుంచి ఈనెల 31వ తేదీలోగా పీహెచ్‌సీలో అందజేయాలని సూర్యనారాయణరెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక



శ్రీవీర వెంకట్



ఆకాంక్ష



సత్యశ్రీ

రామచంద్రపురం రూరల్: మండలంలోని హసన్‌బాద, వెల్ల జెడ్పీ హైస్కూళ్ల నుంచి విద్యార్థులు నేషనల్ మీన్స్ అండ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్)కు ఎంపికైనట్లు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గోర్స లక్ష్మి, పోలిశెట్టి రాంబాబులు శనివారం విలేకరులకు తెలిపారు. హసన్‌బాద జెడ్పీ హైస్కూల్ నుంచి సూరంపూడి దిలీప్ శ్రీవీర వెంకట్, దాకే ఆకాంక్షలు ఎంపికయ్యారు. అలాగే వెల్ల జెడ్పీ హైస్కూల్ నుంచి పెదిరెడ్డి లక్ష్మీనాగ సూర్య సత్యశ్రీ ఎంపికయ్యింది. తమ చిన్నారులు జాతీయ స్థాయి స్కాలర్‌షిప్‌నకు ఎంపిక కావడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమ చిన్నారులను తీర్చిదిద్దిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

వైభవంగా త్రిరాత్ర దీక్షా చండీయాగం



రాయవరం రాజేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిసున్న చండీ యాగం పూజలు

రాయవరం: స్థానిక పార్వతీ సమేత రాజేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవీ వసంత త్రిరాత్ర రుద్ర సహిత చండీ యాగం వైభవంగా సాగుతోంది. శుక్రవారం ప్రారంభమైన చండీయాగం ఆదివారం సాయంత్రంతో ముగుస్తుంది. ఓం శక్తి సత్సంగం ఆధ్వర్యంలో గ్రామస్తుల సహకారంతో ఆలయ ప్రధానార్చకులు విలపర్తి ఫణిధర్‌శర్మ, శశిధర్‌శర్మ పర్యవేక్షణలో సుమారు 10 మంది వేద పండితులు యాగ క్రతువు నిర్వహిస్తున్నారు. చండీ యాగంలో భాగంగా ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు యాగ దంపతులచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి మూల మంత్ర, పంచ సూక్త, నవగ్రహ హోమాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 27న ఉదయం 11గంటలకు ఘనంగా అన్న సమారాధన నిర్వహించనున్నట్టు యాగ నిర్వాహకులు తెలిపారు.

ప్రభుత్వ సాయంతో ఇళ్లు నిర్మించుకోండి



అంగర సచివాలయంలో ఇళ్ల నిర్మాణాలపై చర్చిస్తున్న ప్రత్యేకాధికారి శాంతి

కపిలేశ్వరపురం: ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకుని సొంత ఇంటి కలను సాకారం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి ఎ.శాంతి అన్నారు. అంగర సచివాలయం–1లో హౌసింగ్ ఏఈ పీవీఎస్ఎన్‌మూర్తి ఆధ్వర్యంలో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలపై శనివారం సమీక్ష నిర్వహించారు. కార్యదర్శి కామేశ్వరరావు, సచివాలయ ఉద్యోగులు ఇళ్ళ మంజూరు వివరాలను వెల్లడించారు. సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు అడ్డాల శ్రీనివాస్ మాట్లాడుతూ అంగర హౌస్కూల్ వద్ద లే అవుట్‌ను నిర్మాణాలకు సిద్ధం చేసినట్టు తెలిపారు. పరిమిత ఖర్చుతో నాణ్యమైన ఇల్లు నిర్మించుకునే శాస్త్రీయమైన పద్ధతులపై హౌసింగ్ అధికారులతో సంప్రదించాలని లబ్ధిదారులను కోరారు.